# సూపర్‌బెట్ చాంప్ ప్రజ్ఞానంద



బుచారెస్ట్(రొమేనియా): భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద..సూపర్‌బెట్ క్లాసిక్ టోర్నీలో విజేతగా నిలిచాడు. గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరిగిన టోర్నీలో ప్రజ్ఞానంద తొలిసారి టైటిల్ దక్కించుకున్నాడు. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన టోర్నీలో ఈ చెన్నై చిన్నోడు టైబ్రేక్ ద్వారా టైటిల్‌ను ఒడిసిపట్టుకున్నాడు. ప్రజ్ఞానంద, అలీరెజాఫిరౌజా, మాక్సిమ్ వాచిర్ లాగ్రేవ్‌తో కలిసి సంయుక్తంగా 5.5 పాయింట్లతో సమంగా నిలిచారు. దీంతో విజేతను నిర్ణయించేందుకు జరిగిన టైబ్రేక్‌లో ప్రజ్ఞానంద..ఫిరౌజాతో గేమ్‌ను డ్రా చేసుకోగా, వాచిర్ లాగ్రేవ్‌తో ఫిరౌజా డ్రా చేసుకున్నాడు. ఆఖరి గేమ్‌లో వాచిర్‌ను ఓడించడం ద్వారా ప్రజ్ఞానంద విజేతగా నిలిచి 66 లక్షల ప్రైజ్‌మనీని సొంతం చేసుకున్నాడు.

# శ్రీజకు నిరాశ

## టీటీ ప్రపంచ చాంపియన్‌షిప్



దోహా: ప్రతిష్ఠాత్మక టేబుల్ టెన్నిస్(టీటీ) ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత నంబర్ వన్ ప్యాడ్లర్ ఆకుల శ్రీజకు నిరాశ ఎదురైంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి పోరులో శ్రీజ 11-9, 8-11, 6-11, 5-11, 2-11తో సుతాసిని సావెట్ట(థాయ్‌లాండ్) చేతిలో ఓటమిపాలైంది. ఆసక్తికరంగా సాగిన పోరులో తొలి గేమ్‌ను కైవసం చేసుకున్న శ్రీజ...అనవసర తప్పిదాలతో ప్రత్యర్థికి పాయింట్లు ఇచ్చుకుని వరుస గేమ్‌లు కోల్పోయి 33 నిమిషాల్లోనే తన పోరాటాన్ని ముగించింది. ఇదిలా ఉంటే మహిళల డబుల్స్‌లో భారత ద్వయం ఐహిక, సుతీర్థ ముఖర్జీ 4-11, 11-9, 10-12, 11-9, 11-7తో టర్కీ జోడీ ఒజె యిల్మాజ్, ఎకె హరాక్‌పై గెలిచి ముందంజ వేసింది. మరో పోరులో దియా చితాలె, యశస్విని జంట 9-11, 11-2, 11-9, 11-8తో ఉజ్బెకిస్థాన్ ద్వయం మార్గీవా, ఎర్బకెవాపై గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో మానవ్ థక్కర్, మానుశ్ షా ద్వయం 11-7, 11-8, 11-6తో స్లోవెకియా జంట డెనీ కుజోల్, పీటర్ హ్రిబర్‌పై గెలిచి శుభారంభం చేసింది.



గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన స్పోర్ట్స్ డేలో ఆకట్టుకున్న మిస్ వరల్డ్ బ్యూటీలు. వివిధ దేశాల నుంచి వచ్చిన అందగత్తెలు పలు క్రీడాంశాల్లో తమ ప్రతిభ చాటారు. యోగాసనాలు చేసిన బ్యూటీలు స్టేడియంలో కలియదిరుగుతూ అభిమానులను అలరించారు. వివిధ పోటీల్లో రాణించిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వర్షార్పణం

## బెంగళూరు, కోల్‌కతా మ్యాచ్ రద్దు • ఇరు జట్లకు చెరో పాయింట్ • ప్లేఆఫ్స్ నుంచి కేకేఆర్ నాకౌట్

బెంగళూరు: ఐపీఎల్ పునఃప్రారంభం మ్యాచ్ రద్దుతో మొదలైంది. భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణంతో నిలిచిపోయి తొమ్మిది రోజుల తర్వాత తిరిగి మొదలైన ఐపీఎల్‌కు వరుణుడు అడ్డంకిగా నిలిచాడు. ఎడతెరిపిలేని వర్షంతో బెంగళూరు చిన్నస్వామి స్టేడియం తడిసిముద్దయ్యింది. శనివారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ), కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) మధ్య మ్యాచ్ వర్షం కారణంగా కనీసం టాస్ పడకుండానే రద్దయ్యింది. ఎంతసేపటికి వర్షం తగ్గే సూచన కనిపించకపోవడం, మైదానం చిత్తడిగా మారడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మ్యాచ్ రద్దుతో ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. డిఫెండింగ్ చాంపియన్ కేకేఆర్ మరో మ్యాచ్ మిగిలుండగానే ప్లేఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించింది. మరోవైపు ఒక పాయింట్ ఖాతాలో వేసుకున్న ఆర్‌సీబీ 17 పాయింట్లతో ప్రస్తుతం అగ్రస్థానంలో నిలిచింది. ఇటీవలే అంతర్జాతీయ టెస్టులకు వీడ్కోలు పలికిన తర్వాత ఆర్‌సీబీ దిగ్గజం విరాట్ కోహ్లీ ఆడుతున్న తొలి మ్యాచ్ చూసేందుకు అభిమానులు చిన్నస్వామి స్టేడియానికి భారీగా తరలివచ్చారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కోహ్లీ టెస్టు జెర్సీలు ధరించి స్టేడియానికి వచ్చారు. తెలుపు రంగు జెర్సీలతో చిన్నస్వామి స్టేడియం కొత్తరూపు సంతరించుకుంది. వర్షం తగ్గుతుందని ఆశగా ఎదురుచూసిన అభిమానులకు ఆఖరికి నిరాశే ఎదురైంది. మ్యాచ్ రద్దయ్యిందని అంపైర్లు ప్రకటించగానే భారంగా మైదానాన్ని వీడారు. ఆదివారం ఐపీఎల్‌లో డబుల్ హెడర్ జరుగనుంది. తొలి మ్యాచ్‌లో రాజస్థాన్-పంజాబ్ తలపడనుండగా, రెండో పోరులో ఢిల్లీ, గుజరాత్ అమీతుమీ తేల్చుకోనున్నాయి.



'విరాట్ కోహ్లీ మేమందరం నిన్ను అమితంగా అభిమానిస్తున్నాం. టెస్టు క్రికెట్‌ను మళ్లీ మరింత ఆకర్షణీయంగా మలిచినందుకు' అని రాసిన ఉన్న భారీ బ్యానర్‌ను చిన్నస్వామి స్టేడియంలో అభిమానులు ప్రదర్శించారు. కోహ్లీ 18 నంబర్ జెర్సీని ధరించిన ఫ్యాన్స్ స్టేడియంలో హల్‌చల్ చేశారు.

### పాయింట్ల పట్టిక

| జ | మ్యా | గె | ఓ | ఫ.తే | పా | ర.రే |
|---|---|---|---|---|---|---|
| బెంగళూరు | 12 | 8 | 3 | 1 | 17 | 0.48 |
| గుజరాత్ | 11 | 8 | 3 | 0 | 16 | 0.79 |
| పంజాబ్ | 11 | 7 | 3 | 1 | 15 | 0.37 |
| ముంబై | 12 | 7 | 5 | 0 | 14 | 1.15 |
| ఢిల్లీ | 11 | 6 | 4 | 1 | 13 | 0.36 |
| కోల్‌కతా X | 12 | 5 | 6 | 2 | 12 | 0.19 |
| లక్నో | 11 | 5 | 6 | 0 | 10 | -0.46 |
| హైదరాబాద్ X | 11 | 3 | 7 | 1 | 7 | -1.19 |
| రాజస్థాన్ X | 12 | 3 | 9 | 0 | 6 | -0.71 |
| చెన్నై X | 12 | 3 | 9 | 0 | 6 | -0.99 |

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, ఫ.తే-ఫలితం తేలనిది పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

# కోహ్లీ లాంటి క్రికెటర్లకు కొదువ లేదు: అసదుద్దీన్ ఒవైసీ



హైదరాబాద్: విరాట్ కోహ్లీ లాంటి క్రికెటర్లకు భారత్‌లో కొదువలేదని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. వెన్నుతట్టి ప్రోత్సహించాలే కానీ కోహ్లీ వంటి క్రికెటర్లు వెలుగులోకి వస్తారని అన్నారు. మీడియాతో సరదాగా మాట్లాడిన అసద్ తన కాలేజీ రోజుల్లో క్రికెట్ కెరీర్‌పై ఆసక్తికర అంశాలు పంచుకున్నారు. '90వ దశకం తొలినాళ్లలో ఇంటర్ యూనివర్సిటీ టోర్నీలో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ, బెంగళూరు యూనివర్సిటీ మధ్య మ్యాచ్ జరిగింది. అందులో మాజీ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్ విఫలమైన చోట నేను మీడియం పేసర్‌గా 79 పరుగులిచ్చి 6 వికెట్లు తీశాను. కానీ ఆ మ్యాచ్‌లో ఓయూ ఓడిపోయింది. ఆ తర్వాత సౌత్ జోన్, అండర్-25, విజ్జి ట్రోఫీ లాంటి టోర్నీలు ఆడాను. 1994లో లా చదివేందుకు లండన్ వెళ్లడంతో క్రికెట్ కెరీర్‌కు అర్ధాంతరంగా ముగిసింది. అజారుద్దీన్ లాంటి క్రికెటర్‌తో నేను పోల్చుకోను. భారత్ తరఫున అతను 99 టెస్టులాడిన దిగ్గజ క్రికెటర్, నేనొక సాధారణ మీడియం పేసర్. రాజకీయ నాయకునిగా అతనితో విబేధాలు ఉన్నా..క్రికెటర్‌గా అజర్ ప్రతిభ అసాధారణం. భారత క్రికెట్‌లో పరిస్థితులు చాలా మారాయి. పేద కుటుంబం నుంచి వచ్చిన సిరాజ్ ఇప్పుడు స్టార్ క్రికెటర్‌గా ఎదిగాడు. ప్రతిభకు తగ్గట్లు బీసీసీఐ క్రికెటర్లను ప్రోత్సహించడం మంచి పరిణామం. సరైన ప్రోత్సాహం అందిస్తే కోహ్లీ లాంటి క్రికెటర్లు చాలా మంది వెలుగులోకి వస్తారు. టెస్టులకు కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటించడం నిరాశ కల్గించినా..అతని ఆట తీరు అద్భుతం. ముఖ్యంగా కోహ్లీ కవర్‌డ్రైవ్ షాట్ క్లాసిక్' అని అన్నారు.

# బార్డక్స్ సెమీస్‌లో భాంబ్రీ జోడీ

న్యూఢిల్లీ: బార్డక్స్ చాలెంజర్ టోర్నీలో భారత్, అమెరికా జోడీ యుకీ భాంబ్రీ, రాబర్ట్ గాలోవె సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో భాంబ్రీ, రాబర్ట్ ద్వయం 7-5, 6-3తో అన్‌సీడెడ్ ఫ్రెంచ్ జంట క్వింటన్ హేల్స్, అల్బనో ఒలీవెట్టిపై అలవోక విజయం సాధించింది. గంటా ఎనిమిది నిమిషాల్లో ముగిసిన పోరులో భాంబ్రీ, రాబర్ట్ తమదైన ఆధిపత్యాన్ని కొనసాగించారు. మరో డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీ మిగ్యుల్ రెయిస్ జోడీ క్వార్టర్స్‌లో ఓడి నిష్క్రమించింది.

# నిత్యకు మూడో స్థానం

తిరువనంతపురం: ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు సన్నాహకంగా శనివారం మొదలైన ఇండియన్ గ్రాండ్‌ప్రి-2లో అథ్లెట్లు అదరగొట్టారు. మహిళల 100మీటర్ల రేసులో తెలంగాణ యువ అథ్లెట్ నిత్య గంధె 11.61సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచింది. ఇదే పోటీలో అభినయ(11.55సె), స్నేహ(11.60సె) వరుసగా తొలి రెండు స్థానాలు దక్కించుకున్నారు. ఈనెల 27 నుంచి కొరియాలో ఏషియన్ అథ్లెటిక్స్ టోర్నీ మొదలుకానుంది.

# భారత్ X బంగ్లా

## నేడు సాఫ్ అండర్-19 ఫైనల్

యుపియా(అరుణాచల్‌ప్రదేశ్): సాఫ్ అండర్-19 చాంపియన్‌షిప్‌లో ఫైనల్ పోరుకు రంగం సిద్ధమైంది. ఆదివారం ఆతిథ్య భారత్, బంగ్లాదేశ్ టైటిల్ ఫైట్‌లో తలపడనున్నాయి. టోర్నీలో అపజయమెరుగని యువ భారత్ గ్రూపు దశలో శ్రీలంకపై 8-0తో, నేపాల్‌పై 4-0తో, సెమీస్‌లో మాల్దీవులపై 3-0తో గెలిచి మంచి జోరుమీదుంది. మరోవైపు బంగ్లా కూడా దూకుడు మీద కనిపిస్తున్నది. మాల్దీవులతో మ్యాచ్ డ్రా చేసుకున్న బంగ్లా..భూటాన్‌పై 3-0తో, నేపాల్ 2-1తో గెలిచింది. ఆదివారం ఫైనల్ మ్యాచ్ గెలిస్తే భారత్ ఖాతాలో 10వ సాఫ్ టైటిల్ చేరుతుంది. ఇప్పటి వరకు నాలుగు సార్లు సాఫ్ వేర్వేరు వయసు విభాగాల ఫైనల్లో బంగ్లాతో తలపడిన భారత్ అన్నింటిలో విజయం సాధించడం విశేషం.

# కొంచెం మోదం కొంచెం ఖేదం



ఈ నెల 20న అగ్రహీరో ఎన్టీఆర్ జన్మదినం. ఈ సందర్భంగా ఆయన తాజా చిత్రాలు 'వార్-2', 'ఎన్టీఆర్‌నీల్' (వర్కింగ్ టైటిల్)కు సంబంధించిన అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఎన్టీఆర్‌నీల్' సినిమా ఫస్ట్‌లుక్ కోసం ఉత్కంఠత ఎక్కువైంది. అయితే ఈ విషయంలో అభిమానులను కాస్త డిజప్పాయింట్ చేస్తూ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఎన్టీఆర్ బర్త్‌డే రోజున 'వార్-2' అప్‌డేట్ వస్తున్నందున, 'ఎన్టీఆర్‌నీల్' అప్‌డేట్‌ను వాయిదా వేశామని, సరైన సమయంలో మిసైల్ వంటి బ్లాస్టింగ్ న్యూస్‌ను అందిస్తామని వెల్లడించింది. దీంతో అభిమానులు కాస్త నిరుత్సాహపడ్డారు. అదే సమయంలో ఎలాగూ 'వార్-2' అప్‌డేట్ ఉంది కదా...ఈసారికి దాంతో సరిపెట్టుకుందాంలే అని రిలీఫ్‌గా ఫీలవుతున్నారు. ఎన్టీఆర్-ప్రశాంత్‌నీల్ సినిమా ఇప్పటికే ఓ షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. వచ్చే ఏడాది జూన్ 25న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇక ఎన్టీఆర్ తొలి స్ట్రెయిట్ హిందీ చిత్రం 'వార్-2' ఆగస్ట్ 14న విడుదలకానుంది.

# చిరుతో తీన్‌మార్



సైరా నరసింహారెడ్డి, గాడ్‌ఫాదర్ చిత్రాల్లో మెగాస్టార్ చిరంజీవితో కలిసి నటించింది అగ్ర కథానాయిక నయనతార. తాజాగా ఈ భామ మరోమారు చిరుతో ఆడిపాడేందుకు సిద్ధమవుతున్నది. చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. 'మెగా157' వర్కింగ్ టైటిల్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రానికి సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మాతలు. ఈ సినిమాలో నయనతార కథానాయికగా నటించనుంది. ఇప్పటికే ఈ వార్త ప్రచారంలో ఉండగా తాజాగా మేకర్స్ అధికారికంగా ఖరారు చేశారు. ఈ సందర్భంగా శనివారం దర్శకుడు అనిల్ రావిపూడి స్పెషల్ వీడియోను రిలీజ్ చేశారు. ఇందులో నయనతార తెలుగులో మాట్లాడటం, కారు ప్రయాణంలో చిరంజీవి క్లాసిక్ పాటలు వినడం, స్క్రిప్ట్ చదవడం, చిరు డైలాగ్ చెప్పడం ఆకట్టుకునేలా ఉంది. చివరగా తాను చిరంజీవి సరసన నటిస్తున్నట్లు నయనతార అనౌన్స్ చేశారు. ఈ సినిమాలో చిరంజీవి పాత్ర చక్కటి హాస్యం కలబోతగా సాగుతుందని, అభిమానులు పండుగ చేసుకునేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దబోతున్నామని మేకర్స్ ధీమా వ్యక్తం చేశారు.

చిత్రం

# పాన్ ఇండియా విక్టరీ మార్చ్




అగ్ర హీరో విజయ్ దేవరకొండ మరో ఘనతను సొంతం చేసుకున్నారు. ప్రముఖ ఫిల్మ్ మ్యాగజైన్ ఫిల్మ్‌ఫేర్.. విజయ్ దేవరకొండ స్టైలిష్ స్టిల్‌తో మే నెలకు సంబంధించిన కవర్‌పేజీని పబ్లిష్ చేసింది. 'విక్టరీ మార్చ్' అనే శీర్షికతో ఈ ముఖచిత్రాన్ని ముద్రించింది. అనతికాలంలోనే పాన్ ఇండియా స్టార్‌గా విజయ్ దేవరకొండ ఎదిగిన వైనాన్ని ఈ సంచికలో విశ్లేషించారు. ఈ ఎడిషన్‌లోని స్టిల్స్ విజయ్ దేవరకొండ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' చిత్రంలో నటిస్తున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న ఈ మూవీ జూలై 4న ప్రేక్షకుల ముందుకురానుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ సినిమాపై ఇప్పటికే పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలేర్పడ్డాయి. తాజాగా ఫిల్మ్‌ఫేర్ కవర్‌పేజీపై విజయ్ దేవరకొండ దర్శనమివ్వడంతో ఆయన అభిమానులు ఖుషీ అవుతున్నారు. ఈ సినిమాతో పాటు రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మరో పీరియాడిక్ కథలో నటించేందుకు విజయ్ దేవరకొండ సిద్ధమవుతున్నారు.



# సిద్ధాంత పోరాటం 'థగ్‌లైఫ్'

కమల్‌హాసన్ కథానాయకుడిగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'థగ్‌లైఫ్' జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. శనివారం చెన్నైలో ట్రైలర్‌ను విడుదల చేశారు. నమ్మకద్రోహం, అహంతో కూడిన ప్రపంచాన్ని చూపిస్తూ ట్రైలర్ మొదలైంది. ఇందులో కమల్‌హాసన్ పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించారు. శింబు పాత్ర ఎనర్జిటిక్‌గా ఉంది. ఇది సాధారణ ప్రతీకార కథ కాదని, సిద్ధాంతల మధ్య పోరాటంగా భావోద్వేగభరితంగా సాగుతుందని మేకర్స్ తెలిపారు. రవి కె చంద్రన్ సినిమాటోగ్రఫీ, ఏ.ఆర్.రెహమాన్ సంగీతం ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచాయి. రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రాన్ని శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై హీరో నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు.

# ఆర్.కె.గౌడ్ 'ఉమెన్స్ కబడ్డీ'



తెలుగు సినీ రంగంలో నిర్మాతగా, దర్శకుడిగా, డిస్ట్రిబ్యూటర్‌గా మంచి గుర్తింపును సంపాదించుకున్నారు ప్రతాని రామకృష్ణ గౌడ్. నేడు ఆయన జన్మదినం. ఈ సందర్భంగా ఆయన 'ఉమెన్స్ కబడ్డీ' పేరుతో కొత్త చిత్రాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. స్పోర్ట్స్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించబోతున్నారు. స్వీయ దర్శక, నిర్మాణంలో ఆర్.కె.గౌడ్ నిర్మిస్తున్న 'దీక్ష' చిత్రం షూటింగ్‌ను పూర్తి చేసుకుంది. జూన్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్.కె.గౌడ్ మాట్లాడుతూ 'దీక్ష' చిత్రం చక్కటి సందేశంతో ఆకట్టుకుంటుందని తెలిపారు. అలాగే సినీరంగంలో తెలంగాణ కార్మికులు పనులు లేక అవస్థలు పడుతున్నారని, ఇక్కడి ప్రతిభావంతులకు అవకాశాలు ఇవ్వాలని కోరారు. ఎఫ్‌డీసీ, ఫిల్మ్ ఛాంబర్ కలిసి యాభైశాతం పనులను తెలంగాణ కార్మికులకు, మిగతా యాభైశాతం ఇతర ప్రాంతాల కార్మికులకు పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్.కె.గౌడ్ డిమాండ్ చేశారు.

# 'భైరవం' థ్రిల్‌ని పంచుతుంది



'ఈ సినిమాలో ఓ డివోషనల్ ఎలిమెంట్ ఉంటుంది. ఓ గ్రామంలో ఉండే గుడికి క్షేత్రపాలకుడు భైరవుడు. అందుకే ఈ సినిమాకు అదే టైటిల్ పెట్టాం. ఈ కథలో యాక్షన్, హారర్, థ్రిల్లర్ అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి' అన్నారు దర్శకుడు విజయ్ కనకమేడల. ఆయన నిర్దేశకత్వంలో బెల్లంకొండ సాయిశ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ కథానాయకులుగా నటించిన 'భైరవం' చిత్రం ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకురానుంది. కె.కె.రాధామోహన్ నిర్మాత. ఈ సందర్భంగా శనివారం దర్శకుడు విజయ్ కనకమేడల విలేకరులతో ముచ్చటించారు. తమిళంలోని 'గరుడన్' మూవీకి రీమేక్ ఇదని, తెలుగు నేటివిటీకి అనుగుణంగా స్క్రిప్ట్‌ను తీర్చిదిద్ది, తనదైన పంథాలో ప్రజెంట్ చేశానని చెప్పారు. 'ఈ కథకు ముగ్గురు హీరోలు పర్‌ఫెక్ట్‌గా కుదిరారు. వారు ఆఫ్‌స్క్రీన్‌లో సైతం మంచి ఫ్రెండ్స్ కావడం వల్ల అన్ని విషయాల్లో సపోర్ట్‌గా నిలిచారు. ఇది ముగ్గురు మిత్రుల మధ్య నడిచే ఫ్యామిలీ డ్రామా. కథలోని సంఘర్షణ, భావోద్వేగాలు హృదయాన్ని కదిలిస్తాయి' అని విజయ్ కనకమేడల తెలిపారు. శ్రీచరణ్ అందించిన మ్యూజిక్ హైలైట్‌గా నిలుస్తుందని, ఇప్పటికే విడుదలైన పాటలు పెద్ద హిట్ అయ్యాయని, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా బాగా కుదిరిందన్నారు. తదుపరి సినిమాల గురించి చెబుతూ 'చిరంజీవిగారి కోసం ఓ కథని సిద్ధం చేసుకున్నా. అలాగే బాలకృష్ణ, వెంకటేష్‌గారి కోసం కూడా కథలు రెడీ చేశా. 'భైరవం' సక్సెస్‌ను బట్టి తదుపరి సినిమాలు ఉంటాయి' అని విజయ్ తెలిపారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి సుమయారెడ్డి



తొలి సినిమా 'డియర్ ఉమ'కు కథానాయికగా, రచయితగా, నిర్మాతగా బహు బాధ్యతలను నిర్వర్తించి, అందరి దృష్టినీ ఆకట్టుకున్నారు తెలుగమ్మాయి సుమయారెడ్డి. అనంతపురంకి చెందిన ఈ తెలుగందం పుట్టిన రోజు నేడు. ఈ సందర్భంగా తన భవిష్యత్ ప్రణాళికల గురించి సుమయారెడ్డి మీడియాకు తెలియజేశారు. సుమచిత్రా ఆర్ట్స్ పతాకంపై త్వరలో సినిమాలను నిర్మించనున్నట్టు ఆమె తెలిపారు. అలాగే, హీరోయిన్‌గా కూడా కొన్ని సినిమాల్లో నటించనున్నట్టు సుమయారెడ్డి పేర్కొన్నారు. త్వరలోనే తన ప్రాజెక్టుల వివరాలు వెల్లడిస్తామని ఆమె చెప్పారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078. Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy**. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.